# కలకాని కథ

డా॥కె.ఎల్.వి. ప్రసాద్




సమయం ఉదయం నాలుగు గంటలు అయివుంటుంది. నిద్ర పట్టక పోవడంతో, నెమ్మదిగా పక్కమీది నుంచి లేచి, వరండాలో కుర్చీ వేసుకుని కూర్చున్నాను. వాతావరణం చల్లగా, హాయిగా ఉంది.

నిద్రలేమి తప్పించి, ఈ నిశ్శబ్ద వాతావరణంలో గడపాలంటే నాకు ఎంతో ఆనందంగా, ఉల్లాసంగా అన్పిస్తుంది.

తెల్లవారిందని గుర్తు చేస్తూ, చెట్లమీద పిట్టల కిలకిల రావాలు, వింత వింత చప్పుళ్ళు వినడానికి గమ్మత్తుగా ఉంటాయి. మానవ మాత్రుల్లాగానే, పొట్టకూటికోసం అవి, నిద్రమత్తు వదిలి దూరతీరాలకు ప్రయాణించే సన్నివేశం చూస్తుంటే గొప్ప థ్రిల్లింగ్‌గా వుంటుంది.

ప్రొద్దున్న యింత త్వరగా లేవడం అంటే, శ్రీమతికి అసలు యిష్టం ఉండదు. ఉదయం లేచిందిమొదలు రాత్రి పడుకునే వరకు తను ఏదో పని యంత్రంలా చేస్తూనే ఉంటుంది. శ్రమించే శరీరం కనుక, చక్కగా నిద్ర పట్టేస్తుంది తనకి. ఆ సమయంలో నిద్రా భంగం అయితే ఎవరికయినా చికాగ్గానే ఉంటుంది.

నేను ఉద్యోగం వెలగబెట్టి నన్నాళ్ళు తను యిబ్బంది పడక తప్ప లేదు. "ఇప్పుడు కూడ అదే హింస అయితే ఎట్లాగండి - బాబూ!" అంటుంది సుభద్ర.

నా ఉద్యోగం అలాంటిది మరి ! కొద్ది సంవత్సరాలు తప్పింది, సర్వీసంతా "అప్ అండ్ డౌన్ల"తోనే సరిపోయింది నాకు! కొంప ఒకచోట.... కొలువు మరోచోట !.... ఏం చేస్తాం !!

ఇల్లాలికి సౌఖర్యంగా ఉండా లంటే, పని చేసేచోటనే నివాసం ఉండాలి మరి ! ఇది అందరికి సాధ్యమయ్యేపనా! అన్ని రకాలుగాను సౌకర్యాలు పెరిగి పోవడంతో, ఎంతదూరం అయినా, సాయంత్రానికల్లా ఇల్లు చేరుకునే అవ కాశాలు యిప్పుడు ఉన్నాయి. దీనిని ఎవరూ యిబ్బంది అనుకోవడం లేదు కూడ !

సుభద్ర నిద్ర లేచిందనడానికి గుర్తుగా,వంటగదిలో చిన్న చిన్న చప్పుళ్ళు ప్రారంభమయ్యాయి. అంటే త్వరలోనే సుభద్ర నుండి పిలుపు వస్తుందన్నమాట! ఆ... పిలుపు కోసం ఎదురు చూడ్డంలో ఎంత మాధుర్యం ఉంటుందో ! అందు లోనే ఆమె అనురాగం, ఆత్మీయత, ప్రేమ కొట్టొచ్చినట్లు కన్పిస్తాయి. నా ఊహను నిజం చేస్తూ -

"ఏమండోయ్‌శ్రీవారూ!అయ్యిందా మీ దంతధావనం ? త్వరగా రండి, కాఫీ చల్లారిపోతుంది." అంటూ ప్రేమరాగం తీసింది సుభద్ర.

"సుభా! యివాల్టికి కాఫీ యిద్దరం కలసి వరండాలో త్రాగుదా మనిపిస్తుందోయ్ ! కాఫీ యిక్కడికి పట్రా రాదూ !" అన్నాను ఆమెకు విన్పించేటట్టు గట్టిగా.

"ఆ...ఆ.... అట్లాగే!! తప్పు తుందా మరి!" అంటూ రెండు కాఫీ కప్పులతో వరం డాలో ప్రత్యక్ష మయ్యింది సుభద్ర.

"ఏమండీ! ఈ వరండాలో కూర్చో వడం అంటే అంత యిష్టమా మీకు! పైగా యీ పూట కాఫీ కూడా యిక్కడే సేవిస్తున్నారు! ఏంటి సంగతి?" అంది ముసి ముసినవ్వులు నవ్వుతూ సుభద్ర.

నిజమే సుభద్రా! ఈ వరండాతో నాకు అమితమైన అనుబంధం! నాన్నగారు బ్రతి కుండగా యిక్కడే, యిలానే కూర్చుని కాలక్షేపం చేసేవారు. ఇప్పటికి ఆయన యిక్కడ కూర్చు న్నట్లుగానే అన్పిస్తుంది నాకు. పైగా యీ చల్లని వాతావరణం,హాయిగా అన్పిస్తుంది కదా?" అన్నాను.

"నిజమేనండీ! మామయ్యగారు యిక్కడే కూర్చుని, వచ్చే-పోయే వాళ్ళం దరికి వరసలు పెట్టి మరీ పలకరిస్తుండేవారు. మీతో ఎప్పుడూ అనలేదుగాని,యిక్కడ కూర్చో వడం, నాకు కూడయిష్టమే!అయితే, అంత అదృష్టం నాకెక్కడిది?" అంది ఓరకంట చూస్తూ సుభద్ర.

"ఇందులో అదృష్టమేముంది సుభద్రా! నువ్వు కూడా నాతోపాటు కూర్చో, యిద్దరం హాయిగా కాస్సేపు కబుర్లు చెప్పు కోవచ్చు" అన్నారు కాస్త హాస్యం పట్టిస్తూ....

"ఆ....ఆ..!! మీరు వంటగదికి వెళ్ళి గరిటలతో యుద్ధం చేయండి, అప్పుడు మీరు చెప్పింది తప్పక వీలవుతుంది" అంది చిరునవ్వు చిందిస్తూ, సుభద్ర.

ప్రేమగా పెంచుకున్న పిల్ల లిద్దరూ, విదేశాలకు వెళ్ళిపోయారు. చదువు పూర్తి కావడంతోనే, అక్కడే ఉద్యోగం, ఆ తర్వాత పెళ్ళిళ్ళు చేసుకుని, డాలర్ల ఆకర్షణలో పడి, అక్కడే స్థిరపడి పోయారు. చివరికి యిద్దరం యిలా ఒంటరిగా మిగిలిపోయాం.పిల్లలు మాకు దగ్గరగా లేకుండా పోయారన్న బాధ, పుండులా సలుపుతున్నా, వాళ్ళ అభి వృద్ధిని కట్టడి చేసే హక్కు మాకు లేదు కదా! మొదట్లో కాస్త బాధ అన్పించినా, తర్వాత సర్దుకుపోక తప్పలేదు మాకు; అప్పటినుంచి సుఃఖదుఃఖాలను, యిద్దరం కలిసే పంచుకోవడానికి అలవాటు పడ్డాం. నేను పరధ్యానంగా ఉండటం చూసి "ఏంటండి ఏదో ఆలో చనలో పడినట్లున్నారు? నాకు తెలీని రహస్యా లతో సతమతమవు తున్నారా ఏమిటి?" అంది, సరదాగా నవ్వుతూ సుభద్ర.

"ఇన్నాళ్ళ కాపురం తర్వాత, నీకు తెలీ కుండా, నాకు రహస్యా లుంటాయా సుభద్రా! ఒకవేళ ఉన్నా, నీ ముందు నేను బ్రతికి బట్టకట్టగలనంటావా?" అన్నాను. ఆమెను ఓరకంట కనిపెడుతూ. తిరిగి, నేనే అందుకుని-

అదేనోయ్ సుభా ! మొన్న శేషగిరి ఫోన్ చేయలేదూ! ఆ... విషయమే గుర్తొచ్చింది." అన్నాను ఆమె ముఖంలోకి చూస్తూ.

"నిజమే సుమండీ! సమయానికి గుర్తుచేసారు. ఎప్పుడో చిన్నప్పుడు చూశాం శేషగిరి పిల్లల్ని. వాళ్ళు పెద్దకావడం, ఉద్యో గాల్లో చేరడం, పెళ్ళిళ్ళు చేసు కోవడం, ఒష్ !! రోజులు ఎంతో స్పీడుగా దొర్లిపోతున్నాయో కదా! ఆలోచిస్తే, ఆశ్చర్య మనిపిస్తుంది అంది సుభద్ర.

'అవును రోజులు యిట్టే గిరుక్కున తిరిగిపోతున్నాయ్.మనపిల్లలు మాత్రం.. వాళ్ళ పరిస్థితి కూడా యింతే కదా! వాళ్ళు ఎదగడం అంటే మనం వృద్ధులం కావడమే మరి!" అన్నాను పిల్లల బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ.

---

**నాటివి - నేటికోసం**

## అసూయ లేకుండటమే అత్యధిక అర్హత

అనుభవంతో కూడిన బ్రహ్మజ్ఞానాన్ని అర్జునుడికి ఉపదేశించ బోతూ శ్రీ కృష్ణ పరమాత్మ ఇలా అంటారు. "అశుభకరమైన సంసారం నుంచి భయటపడాలంటే గోప్యమైన ఆచరణయుక్తమైన బ్రహ్మజ్ఞానం నీకు తెలియాలి. అది ఆషామాషీ జ్ఞానం కాదు. కేవలం పొట్టనిండేందుకు ఉపయోగపడేదీ కాదు. అందరికీ చెప్పదగినదీ కాదు. అటువంటి అరుదైన విజ్ఞాన సహితమైన జ్ఞానాన్ని అసూయాగుణం లేని కారణంగా నీకు ఉపదేశించనున్నాను." అసూయా రాహిత్యమే దీనికి యోగ్యత.

సాక్షాత్తు "అవతారమూర్తులను, పూర్ణగురువులను, మన లౌకిక జ్ఞానలేశంతో పరీక్షిద్దామని వెళ్ళే మూఢులకు సమయం వృధా అవుతుందే తప్ప మరేమీ లభించదు. డంబం, దర్పం అనే వివిధ వర్ణాల అద్దాల నుంచి చూసేవారికి ఆ ఆచ్ఛాదనలతోనే గోచరిస్తాయి గాని సత్యదర్శనం కాదు. వారికి అర్థమైనట్లే ప్రచారం చేస్తారు. తెలియనివారు ఊరుకున్నా మంచిదే. కాని ఇతరులనూ తప్పుదోవ పట్టిస్తారు.

కోవెలకు భగవంతుని దర్శనానికి వెళ్ళి కొందరు మహిళలు ఇతరులు అడగకున్నా పని కట్టుకుని తమ పట్టుచీర విదేశంలో తయారయినదని, దాని భారీ వెలను చాటుకునే మహాతల్లి అహంకారం దాచుకుని స్వామికి సాష్టాంగపడుతుందా? ఇలాటి డాబులు దర్పాలు పురుషులకూ ఉంటాయి.

ఇదిగో ఇలాటి ప్రదర్శనలు, ప్రగల్భాలు అహంకారానికి, అసూయకు నిదర్శనాలు. అలాటివారికి సాధారణ జ్ఞానమే సరిగ్గా వంటపట్టదు. ఇక బ్రహ్మజ్ఞానం సంగతి పెరుమాళ్ళుకెరుక!

మరి మనం అలాంటి వారి చిట్టాలో చేరకుండా జాగ్రత్త వహిస్తే తొలుత సాధారణ జ్ఞానం క్రమేణా అర్హుల ద్వారా బ్రహ్మజ్ఞానం పొందేందుకు యోగ్యత సంపాదించవచ్చు. ప్రయత్నిద్దాం.

పొక్కులూరి సుబ్బారావు

పిల్లల్ని తలుచు కుని, నేనెక్కడ బాధపడిపోతానో నని గ్రహించిన సుభద్ర మాట మార్చి –

"మీరు కాస్సేపు యిక్కడే కూర్చోండి, నేను వంటపని మొదలు పెడ్తాను !! అని, ఖాళీ కప్పులు తీసుకుని వంటగదివైపు వెళ్ళి పోయింది సుభద్ర. నా మనస్సు మాత్రం, గత జ్ఞాపకాలను సింహావలోకనం చేసుకోవడం మొదలుపెట్టింది.

అవి నేను ఉద్యోగంలో చేరిన మొదటి రోజులు. హైద్రాబాద్ నుండి ఒకేసారి మూట – ముల్లె సర్దుకుని వరంగల్ చేరుకున్నాను. సంబంధిత అధికారికి రిపోర్టు చేసి, అదే రోజు నాకు కేటాయించిన మహబూబాబాద్‌కు చేరుకున్నాను. ఆ... ప్రాంతం గురించి చాలా మంది భయపెట్టినట్లుగానే, అక్కడి పరిస్థితులు ఉండేవి. నిరక్షరాస్యత – నిరుద్యోగ సమస్యలతో, సతమతమయిపోతున్న యువతరానికి సరయిన మార్గ దర్శనం చేసే పెద్దలు కరువయి, ఎన్నెన్నో హింసాత్మక సంఘటనలకు పాల్పడేవారు. ఆడపిల్లలే కాదు, పెళ్ళయిన భార్యాభర్తలు సైతం, సాయంత్రంపూట, ఒంటరిగా రోడ్డుమీద నిర్భయంగా నడవలేని పరిస్థితులు ఉండేవి. ఇలాంటి వాతావరణంలో, అక్కడ లెక్చరర్‌గా నా జీవితం ప్రారంభించాను. మొదట్లో కాస్త యిబ్బంది కలిగినా, విద్యార్థుల్లోను వారి తల్లి దండ్రుల దృష్టిలోనూ ఒక మంచి లెక్చరర్‌గా పేరు సంపాదించాను. చదువుతో పాటు, అవసరమైన సంస్కారం గురించి కూడ, విద్యార్థులకి కథలు – కథలుగా చెబుతుండేవాణ్ణి. ఈ రకంగా, అక్కడి ప్రజలలో ఒక ముఖ్యుడిగా మారడానికి సుమారు రెండు సంవత్సరాలు పట్టింది. ఈలోగా సుభద్రతో నా వివాహం కూడ జరిగింది.

సుభద్ర,పట్టణంలో పెరిగిన అమ్మాయి అయినా, ఆ... ఊరంటే చాలా యిష్టపడేది. అటు హైదరాబాదుకు, యిటు విజయవాడకు మధ్యలో ఉండడం వల్ల, ప్రయాణాలకు ఎంతో సౌఖర్యంగా ఉండేది. ఇప్పటికి ఆ...ఊరంటే సుభద్రకి ఎంతో యిష్టం. ప్రతినెల మొదటి వారం లోనే, సుభద్ర నేను కలసి, నెలకు సరిపడ వెచ్చాలు కొని తెచ్చుకునేవాళ్ళం. ఆ రకంగా ఒక షాపు యజమానితో మాకు బాగా పరిచయం యేర్పడింది. ఆ తర్వాత అతను నాకు ముఖ్యస్నేహితుడయినాడు. అతని పేరే శేషగిరి.

అప్పటికి శేష గిరివయసు ముప్పయి లోపే! చదువు పెద్దగా లేకపోయినా, గొప్ప సంస్కారం కలవాడు. మాటకారితనంతో జనాన్ని యిట్టే ఆకర్షించగల సమర్థుడు. వ్యాపారం చేసే విషయంలో అతని తెలివి తేటలు అమోఘం ! మనిషి మనఃస్తత్వాన్ని బట్టి అతను వ్యాపారం చేసేవాడు. అతనంటే అందరికి గొప్ప నమ్మకం! అందుచేతనే, చాలా మంది. అతని దగ్గర షాపింగ్ చేయడానికి యిష్టపడేవారు.



జూన్ 2,2007న కళాసుబ్బారావు కళావేదిక, త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి హైదరాబాద్‌లో పొత్తూరి సుబ్బారావు రచించిన "పిచ్చుకగూడు" కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న రచయిత శీలావీర్రాజు, దత్తాత్రేయ శర్మ, సుధామ, పి. విజయబాబు, కృష్ణమూర్తి, పొత్తూరి సుబ్బారావు, బైసా దేవదాసు, గుదిబండ వెంకటరెడ్డి చిత్రంలో ఉన్నారు.

శేషగిరికి, చిన్నతనంలోనే పెళ్ళి కావడంవల్ల, అప్పటికే ఎదిగిన పిల్లలున్నారు. నలుగురు పిల్లల్లోను ఆడపిల్ల పెద్దది. ఆమె పేరే ప్రతిభ. ప్రతిభ మంచి చలాకయిన పిల్ల. తల్లి దండ్రులన్నా, పెద్ద వాళ్ళన్నా భక్తి, వినయం, విధేయత, మర్యాద. అప్పుడే ఆ అమ్మాయిలో కన్పించేవి. మా యిద్దరితోను, ఎంతో చనువుగా మెలిగేది. క్రొత్తవాళ్ళెవరయినా చూస్తే, ఆమెను మా అమ్మాయే అనుకునేవారు! శేషగిరికి నాకు యేర్పడ్డ మైత్రికి ఆ అమ్మాయి వారధి అయింది.

ఆదివారాలు శేషగిరి దుకాణం తెరవడు. ఇతర పనులు ఏమైనా ఉంటే అవి పూర్తి చేస్తాడు. అలాంటి ఒక ఆదివారం ఉదయం నాముందు ప్రత్యక్షమైనాడు శేషగిరి. అప్పుడే కాఫీ త్రాగి పేపరు చదువుతున్న నాకు, అతని రాకడ కొంచెం ఆశ్చర్యంగానే అన్పించింది. ఏదో పెద్ద పనిమీదే వచ్చినట్టున్నాడు" అని మనస్సులో అనుకుని, మర్యాద పూర్వకంగా పలకరించి, నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోమన్నట్టుగా సైగ చేశాను. "ఏం శేషగిరి... దారి తప్పినట్లున్నారు... ఊరకరారు మహానుభావులు..." అన్నాను నవ్వుతూ.

"మీ దగ్గరికే వచ్చాను సార్!" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

"అయితే ఏదో పెద్ద విశేషమే!" అన్నాను, అతని ముఖంలోకి సూటిగా చూస్తూ.

"అయ్యా, మీరు చదువు నేర్చిన పెద్దలు! చదువు చెప్పే గురువులు!! మీలాంటి వారి సలహాలు లేకుండా, ఒక్క అడుగయినా ముందుకు వేయగలమా?" అన్నాడు, పొడిపొడిగా నవ్వుతూ శేషగిరి.

"అంత ఉపద్రవం ఏం ముంచుకొచ్చిందిప్పుడు? అదేదో త్వరగా బయటికి కక్కేయరాదూ" అన్నాను.

ఉండండి సార్, మేడం గారి చేతి కాఫీ తాగి చాలా రోజులయిపోయింది. అది ఒక గుక్క పడితే తప్ప, నోరు పెగిలే టట్లుగా లేదు" అన్నాడు. అప్పటికే సుభద్ర తెచ్చిన కాఫీ కప్పు అందుకుంటూ కాఫీ త్రాగడం ముగించి, "మీతో ఒక ముఖ్యమయిన విషయం మాట్లాడాలని వచ్చాను సార్. అది కూడ, నా కుటుంబానికి సంబంధించినదే! మరింత వివరంగా చెప్పా

లంటే నా కూతురికి సంబంధించిన విషయం! సావధానంగా విని, మీ అమూల్యమయిన సలహా యివ్వాలి" అన్నాడు. నా ముఖంలోనికి తధేకంగా చూస్తూ. "అదేదో త్వరగా చెప్పు మరి. నాకు తోచిన సలహా నేను చెబుతాను. నీకంటే కావలసిన వాళ్ళు, నాకు యిక్కడ ఎవరున్నారు గనుక!" అన్నాను.

"మీ మీదున్న నమ్మ కంతోనే వచ్చాను. విషయం విన్న తరువాత, మీరు ఏమి చెబితే, అది చేయడానికి సిద్ధంగా ఉన్నాను."అన్నాడు శేషగిరి.

అనవసరంగా నువ్ టెన్షన్ పడుతూ, నన్ను టెన్షన్‌లో ముంచక అసలు విషయానికి రావయ్యా బాబు" అన్నాను కాస్తచికాగ్గా.

"అదేసార్ ! అమ్మాయి గురించి. దానికి పెళ్ళి చేసేద్దామని నేను, 'ఆ... పసిదానికి అప్పుడే పెళ్ళా? అని మా ఆవిడ, రోజు రాత్రి నిద్రపోయే ముందు మాకు పెద్ద యుద్ధమే జరుగుతోంది సార్!" అన్నాడు శేషగిరి సీరియస్‌గా ముఖంపెట్టి.

"ప్రతిభ సంగతా నువ్ మాట్లాడుతున్నది! ఆమె యింకా చిన్నపిల్లే – కదయ్యా! ఆమెకు అప్పుడే పెళ్ళేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

మీరు కూడా అలా అంటారేమిటి సార్! అమ్మాయి పెద్దదయి అప్పుడే రెండునెలలు దాటిపోయింది కదా! ఇప్పటికే ఆలస్యం అయిపోయిందని, దెప్పి పొడుస్తున్నారు బంధువులు!" అన్నాడు చేతులు నలుపుకుంటూ –

"అమ్మాయివయస్సు ఎంతుంటుంది?" అన్నాను సావధానంగా. ఆ... వయస్సుదేముంది సార్! పెద్దదయింది కదా! మొన్ననే ఏడవ తరగతి పరీక్షలు కూడా వ్రాసింది. అటూ – యిటూగా సుమారు పన్నెండు సంవత్సరాలుండొచ్చు" అన్నాడు పెద్ద మేధావిలా ఫోజుపెట్టి.

'గొప్పవాడివయ్యా శేషగిరి! పన్నెండేళ్ళ పసిదానికి పెళ్ళి చేస్తావా... ఆ మాట అనడానికి నీకు నోరెట్లా వచ్చిందయ్యా!" అన్నాను కాస్త కోపంగా. "చూడండి రాఘవయ్య మాష్టారూ ! పన్నెండేళ్ళు మీద పడ్డ ఆడపిల్లలకి, పెళ్ళి చేయకుండా యింట్లో వుంచుకోవడం అన్నది మా ఇంటా, వంటా లేదండి! అసలు, నా పెళ్ళయ్యే నాటికి మా ఆవిడ వయస్సెంతనుకున్నారు?" అంటూ సాగదీయడం మొదలుపెట్టాడు శేషగిరి. "నువ్వు చెప్పింది, నూటికి నూరుపాళ్ళు నిజమే కావచ్చు శేషగిరి! కాని ఆ.. రోజులు వేరు. తెలిసి కొంత, తెలియక కొంతఅప్పుడు తప్పులు జరిగిపోయాయి. ఎన్ని చట్టాలున్నా ఎవరూ పట్టించుకునే వారు కాదు, నిజమే! మరి, యిప్పటి పరిస్థితులు వేరుకదా! మైనారిటీ తీరని పిల్లకి పెళ్ళి చేస్తే, నీ బంధువులు హర్షిస్తా రేమో గాని పోలీసులు మాత్రం నిన్ను అరెస్టు చేసి తీసుకెళ్తారు. ఈ విషయం నీకు తెలుసా!" అన్నాను కాస్త కోపంగా.

"ఆ... అలాగే అంటుంటారు గాని... పెళ్ళిళ్ళు ఎక్కడ ఆగుతున్నాయి? ఎవరు ఆపగలుగుతున్నారు సార్!" అన్నాడు కాస్త మొండిగా.

"చట్టాలు చేసినవాళ్ళు పిచ్చి వాళ్ళు కాదు శేషగిరి! మన పిల్లల మంచి చెడ్డలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే, పెద్దలు అలాంటి చట్టాలు చేశారు. వాటిని గౌరవించవలసిన కనీస బాధ్యత మనకు లేదా?" అన్నాను.


"నిజమే సార్, కాని... ఎదిగిన ఆడపిల్లని యింట్లో ఉంచుకుని...." అంటూ సనగడం మొదలుపెట్టాడు శేషగిరి. "ఇప్పుడిక యివన్నీ అనవసరం శేషగిరి. నా సలహాకు విలువనిచ్చి వచ్చావు గనక, ఒక విషయం నీకు స్పష్టం చేయదలచుకున్నాను. నీకు వినే ఓపిక ఉందా?" అన్నాను కాస్త కోపంగా.

"ఎందుకు వినను సార్! నా ఆలోచనను మీ ముందు పెట్టాను. ఏది మంచో, ఏది చెడ్డో చెబుతారనే కదా మీ దగ్గరకు వచ్చాను. ఏమి చెప్పినా మా మేలు కోరి చెబుతారని నాకు మంచి నమ్మకముంది. మీ సలహాకు కట్టుబడి ఉంటాను" అన్నాడు వినయంగా శేషగిరి.

"అట్లా అన్నావు; బావుంది! ఈ విషయంలో నీ భార్య చెప్పిన మాటే కరెక్టయ్యా! ఆమె అన్నిరకాలుగా అమ్మాయి భవిష్యత్తును ఆలోచించే చెప్పింది. బంధువులు గొడవ చేస్తారని పిల్ల బ్రతుకు నాశనం చేస్తామా చెప్పు! ఈ చిన్నవయస్సులో ఆ అమ్మాయికి పెళ్ళంటే ఏమి తెలుస్తుంది చెప్పు? తన శరీరం గురించి, తనకే సరిగా తెలియని యీ వయస్సులో, రేపు పిల్లలు పుట్టుకొస్తే, వాళ్ళ ఆరోగ్యాన్ని ఎట్లా కాపాడగలుగుతుంది. తన ఆరోగ్యాన్ని ఎట్లా సంరక్షించుకోగలుగుతుంది? తనకు అర్థం కాని యీ సమస్యల నడుమ, ఆమె మానసిక పరిస్థితి ఛిన్నా భిన్నమయిపోదూ! యివన్నీ నువ్వు భరించగలవా? అన్నాను. "అమ్మో ! అట్లా అనకండి సార్, నాకు యిప్పుడే భయమేస్తోంది. అమ్మాయి అంటే నాకు ప్రాణం అన్న సంగతి మీకు తెలుసుకదా! అది బాధపడ్తుంటే నేను చూడలేను మాష్టారూ!" అన్నాడు నా చేతులు గట్టిగా పట్టుకుని.

"అందుకే చెబుతున్నాను విను. ఇప్పటివరకు నీమెదడులో ఉన్న ఆలోచనలకు స్వస్తి పలుకు. కనీసం పదో తరగతి పూర్తయ్యే వరకు ఆమె పెళ్ళి వూసెత్తకు. ఆ... తర్వాత నీ యిష్టం. నీ కూతురి యిష్టం" అన్నాను.

"సార్ ! మా అమ్మాయి గనక టెంత్ పాస్ అయితే, మా



2005 రామాకవితల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కవిత.

# చిత్రం

పసితనంలో అర్థంకాని ఆంగ్లరైమ్సు
కసిగా నేర్పించారే గాని
జీవన ప్రస్థానంలో ఎదురయ్యే
అంతఃకలహాల ఆంతర్యం గురించి
అప్పుడసలు నేర్పనే లేదు !
నామ వాచకాలు - నైసర్గిక స్వరూపాలు
సర్వనామాలు - సిద్ధాంత సూత్రాలు
బడిలో బట్టీ పట్టించారే గాని
పై కెదగాలంటే ప్రక్కవాడికి ఎగనామాలు పెట్టి
తుంగలో తొక్కెయ్యాలనే
అరాచక ఆరాధ్య అధ్యాయం
అభ్యసింపజెయ్యనే లేదు !
నిత్యం నిజాల గురించి
సత్యమార్గాల స్వరూపాల గురించి
వచించారే గాని
వంచన గురించి ఒక్కసారైన
ఒజ్జలు ఒప్పుజెప్పమనలేదు !
తన మార్గానికడ్డొచ్చే చెవుల పిల్లులను సైతం
చంపి అరణ్య రాజ్యమేలుతారని
అప్పుడు ఆలోచింపజేయనేలేదు !
కొన్న చదువుకి సాగించే జీవన సమరానికి
బొత్తిగా పొంతన లేకుండా పోతుంది.
నేర్చుకున్న పాఠాలన్నీ నీతులైతే
జీవించే జీవితమంతా ఎగుడు దిగుడు గోతులే !!
ఒంటికి పట్టించుకున్న పుస్తకజ్ఞానం
ఇంట నేర్చుకున్న అర్ష శాస్త్ర జ్ఞానం
తీసేసిన సిలబస్‌లోనించి వచ్చిన ప్రశ్నలైనాయి.
బంగారు భవిష్యత్తు
సెన్సారు చెయ్యని చిత్రమైపోయింది !
నాతోపాటు నా చుట్టూ ఉన్న సమాజం చిద్రమైపోతూంది !!

**- ఎల్.ఎల్.భాను ఉమా**

వంశంలోనే ఆడపిల్ల పెద్ద చదువు చదివినట్లవుతుంది" అన్నాడు గర్వంగా శేషగిరి.

"ఏమో,కాలం కలసివస్తే మీ అమ్మాయి యింకా పెద్దచదువులు చదివి, మరిన్ని రికార్డులు బ్రేక్ చేస్తుందేమో! ఎవరు చెప్పగలరు?" అన్నాను నవ్వుతూ.

"మీ నోటి మాట చల్లగా ఉండాలి గాని, అంతకంటే కావలసింది ఏముంటుంది సార్! మీ సలహా తు.చ. తప్పకుండా పాటిస్తాను. మా బంధువులకు ఏదో విధంగా నచ్చ చెబుతాను. నా కూతురు బంగారు భవిష్యత్తు కోసం ఏమైనా చేస్తాను" అంటూ, చేతులు జోడించి, అప్పటికి నన్ను వదిలి వెళ్ళిపోయాడు శేషగిరి.

ఆ తర్వాత నేను వరంగల్ వచ్చేయడం. రోజూ డ్యూటికి అప్ అండ్ డౌన్ చేయడంవల్ల మేమిద్దరం కలుసుకుని మాట్లాడుకునే సన్నివేశాలు తగ్గిపోయాయి. కాలేజి దగ్గర ఎప్పుడు కలిసినా,కూతురు చదువులో చూపిస్తున్న ప్రగతి గురించి చాలా గొప్పగా, గర్వంగా చెబుతుండేవాడు.

నేను జనగాం బదిలీ కావడానికి పది రోజుల ముందు, శేషగిరి నన్ను కలవడానికి హడావిడిగా కాలేజీకి వచ్చాడు. వచ్చీ రావడంతోనే కూతురు చదువును గురించిన కబుర్లు మొదలు పెట్టాడు. ప్రతిసారి మంచి మార్కులతో, కాలేజి ఫస్ట్ వస్తున్న తన తెలివైన కూతురు చదువు మాన్పించనని బలవంతంగా మెడలు వంచి పెళ్ళి చేయనని ఆ... చదువుల సరస్వతిని మరో రూపంలో వూహించ లేనని, తను ఎంతవరకు చదువుకుంటానంటే, అంతవరకు చదివిస్తా నని, ఎంతో ఆనందంగా చెప్పాడు. "నీ నిర్ణయం నాకునచ్చింది. శభాష్ శేషగిరి!" అన్నాను. "అవునుసార్! నాబుర్రలో పేరుకు పోయిన మట్టిని, మీ మాటలతో కడిగి వుండక పోతే బంగారంలాంటి నా చిన్నితల్లి బ్రతుకు నా చేతులారా నాశనం చేసి వుండేవాడిని" అన్నాడు కళ్ళు కాస్త తడి చేసుకుంటూ. తర్వాత మేము కలుసుకుని మాట్లాడుకున్న సంఘటనలు చాలా తక్కువ.

కూతురుకి, మెడికల్ కాలేజిలో అడ్మిషన్ దొరికినప్పుడు, కూతురును వెంటబెట్టుకుని సరాసరి మా యింటకే వచ్చాడు శేషగిరి. అతని ఆనందానికి ఆనకట్టలు లేవు. విషయం తెలుసుకున్నాక నాకు సంతోషం కలిగింది. ప్రతిభ, పట్టుదల, ఆత్మవిశ్వాసం మనిషి ఎదుగుదలకు, ఎంత ఉపయోగపడ్తుందో, ప్రతిభ స్వయంగా నిరూపించింది.

"మీఋణం తీర్చుకోలేనిది మాష్టారూ" అంటూ నా చేతులు గట్టిగా పట్టుకున్నాడు శేషగిరి.

"నాదేముంది శేషగిరి. తరతరాలుగా ఆడపిల్లలకు జరుగుతున్న అన్యాయాలు ఎటువంటివో, సమగ్రంగా అధ్యయనం చేసినవాణ్ణి. మన కళ్ళ ముందే ఎందరిజీవితాలు అన్యాయం అయిపోతు న్నాయో. నీకు మాత్రం తెలియని విషయం కాదు. తెలిసి కూడా మనం ఏమి చేయలేని పరిస్థితి. నీ విషయంలో మాత్రం అలా జరగలేదు. ఒక సిద్ధాంతానికి కట్టుబడి నువ్వే ధైర్యంగా నిలబడ్డావు.యిక్కడ నువ్వే హీరోవి!"అన్నాను.

మెడిసిన్ పూర్తయిన వెంటనే, పీ.జీ సర్జన్ని అయిందనిపించి, ఉద్యోగంలో చేరిపోయింది డా॥ప్రతిభ. అప్పుడప్పుడు మా యింటికి వచ్చి మాతో గడిపి వెళ్తుండేది. తగిన వయస్సులో పెళ్ళి చేయకుండా చదివించినందుకు బంధు మిత్రుల ఆగ్రహానికి గురికాక తప్పలేదు శేషగిరి. అయినా, అతను ఎంతో నిగ్రహం పాటించి అనుకున్నది సాధించాడు.

తన కూతురు చదువుకు,వయస్సుకు, హోదాకు తగిన, సాఫ్ట్‌వేర్ - యింజనీర్ కిచ్చి

ఘనంగా కూతురు పెళ్ళి జరిపించాడు శేషగిరి. ఉద్యోగం పేరు మీద కూతురు, అల్లుడు అనేక ప్రాంతాలు తిరిగి యిప్పుడు ప్రత్యేక హోదాలో యిక్కడికి వస్తున్నారు.

ఏమండోయ్, మీ పరధ్యానం పాడు గాను! మన గేటుదగ్గర కారు హారన్ అంత గట్టిగా మ్రోగుతుంటే, విన్పించడం లేదూ"అని గట్టిగా అరుస్తూ, సుభద్ర బయటికి వచ్చేవరకు నా ఆలోచనలకు బ్రేక్ పడనేలేదు.

"అవునోయ్! ఆ కారు, మన శేషగిరి వాళ్ళదే! అదుగో, డా॥ప్రతిభ కూడ వచ్చింది. కేవలం మనయింటికి రావడమే కాదు, యీ జిల్లా వైద్యాధికారిగా వచ్చింది." అంటూ, చెప్పలేని ఆనందంతో అడుగులు ముందుకు వేసాను.


**తారల అడ్రసులు**

వై.కె.మూర్తి, దాసరివారి వీధి సూర్యారావుపేట, విజయవాడ-2 కు రూ.20/- లు ఎం.ఓ చేయండి. సినీ నటీనటుల అడ్రసులతోపాటు ఓ జోకుల పుస్తకం కూడా పొందండి.


**చినుకు సాహిత్య మాసపత్రికకు పంపే కథలు అచ్చులో 3 పేజీలకు మించకుండా పంపవలెను.**

# దిటవు గుండెలు

## కడియాల రామమోహనరాయ్

2వ ప్రపంచ యుద్ధ కాలంలో, 1941లో జర్మనీ సోవియట్ యూనియన్ మీద దాడిచేసి కొన్ని ప్రాంతాల్ని ఆక్రమించినప్పుడు, సోవియట్ గెరిల్లాలు జర్మన్లపై చేసిన వీరోచిత పోరాటాల చరిత్ర 'దిటవు గుండెలు'.




పుస్తకమంతా యుద్ధ బీభత్సమే. గెరిల్లాల సాహసకృత్యాలే. ఒళ్ళు గగుర్పొడిచే బీభత్స దృశ్యాలే – "ఈ భూస్థలి అంతా తడిసెను రక్తంతో, కాకుంటే కన్నీటులతో" అన్న మహాకవి మాట జ్ఞాపకం వస్తుంది.

పారాఘూట్‌లో అడవిలో శత్రువులెవరో మిత్రులెవరో తెలియని చోట ప్రాణాలకు తెగించి దిగటం; కేంపులో శత్రువులు ఎప్పుడొచ్చి మీద పడతారో తెలియని భయానక వాతా వరణం. గాయపడిన సహచరులకు సపర్యలు – వీటన్నిటిని చదువుతున్న ప్పుడు పాఠకులకు తామూ ఆ పోరాటంలో పాల్గొన్న అనుభూతి కలుగుతుంది. పోరాటంలో పాల్గొన్న రచయిత మేద్వేదెవ్ తన అనుభవాలను పోరాట జీవితాన్ని ఉత్కంఠ భరితంగా ఇందులో అందించారు.

**దిటవు గుండెలు**
(2వప్రపంచ యుద్ధకాలంలో సోవియట్ గెరిల్లాల యుద్ధగాథ)
**రష్యన్‌మూలం :** ద్మిత్రియ్ మెద్వేదెవ్
**ఇంగ్లీషు నుంచి తెలుగు :** పుప్పల లక్షణరావు
**వెల :** రూ.30/-
**ప్రతులకు:**
నవోదయ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
ఆర్యసమాజమందిరం ఎదురు వీధిలో,
కాచీగూడా చౌరాస్తా,హైదరాబాదు - 27

శ్రీ పుప్పల లక్ష్మణరావు తెలుగునుడి కారానికి భంగం కలుగు రీతిలో ఆసక్తికరంగా అనువదించారు.

యుద్ధాన్ని గురించి తెల్పిన తెలుగు రచనలు చాలా కొద్ది. అధర్మాన్ని ఎదిరించాలను కొనే యువతరం ముందుగా "విప్లవం విందు భోజనం కాదు" అనే సత్యాన్ని తెలుసు కోవాలి. ఉరవళ్ళు పరవళ్ళు కింద ఎంత దిటవు గుండెలు ఉండాలో తెలుసుకోవాలంటే యీ వీరగాథ తప్పక చదవాలి.

ప్రజలకు మంచి పుస్తకాలు అందుబాటుధరలో అందించాలనే సంకల్పంతో రంగనాయకమ్మగారు, వారి మిత్రులు ప్రగతి ప్రచురణలు ప్రారంభించి 'దిటవుగుండెలు' లాంటి మంచి పుస్త కాన్ని రూ.30/-లకే ఇస్తున్నారు.

తమ భావాల్ని ప్రచారం చేయ దలచుకున్న రచయితలు డబ్బును, కీర్తిని ఆశించకుండా డబ్బు నష్టపోవడానికి సిద్ధమై సమాజానికి మేలు చేయవలసిన అవసరాన్ని రంగనాయకమ్మ తన ముందు మాటలో తెలియజెప్పారు.

మంచి పుస్తకాలు కావాలనుకొనేవారు 'దిటవుగుండెలు' తప్పక కొని చదవాలి.